# టూ ఇయర్స్ ఇన్ టూ డేస్

ప్రఖ్యాత ఆంగ్ల నవలా రచయిత సెన్‌స్టీలెట్ తన ఆఫీసు గదిలో కూర్చుని, కళ్ళు మూసుకుని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. ఓవైపు గోడకి రిఫరెన్స్ పుస్తకాల షెల్ఫ్, ఎడం పక్క టేబుల్ మీద రెండు టెలిఫోన్లు, ఓ ఇంటర్‌కమ్, ఎదురుగా వున్న టేబుల్‌మీద ఒక ఎలక్ట్రానిక్ టైప్‌రైటర్, ఒక పర్సనల్ కంప్యూటర్.

అప్రయత్నంగా అతని చెయ్యి ఇంటర్ కమ్ బటన్ నొక్కింది.

"అనీ! కెన్నెత్ నుంచి ఏదైనా మెసెజ్ వచ్చిందా!" ఈ ప్రశ్న వినడం ఉదయం నుంచీ ఇది పదోసారి సెక్రటరీ అనీకి.

"లేదు" మెల్లిగా సమాధానం చెప్పింది అనీ. తిరిగి దీర్ఘాలోచనలో పడిపోయాడు సెన్‌స్టీలెట్.

★ ★ ★

గత రెండు సంవత్సరాలుగా సెన్‌స్టీలెట్ ఒక పెద్ద నవల వ్రాయడంలో నిమగ్నమై వున్నాడు. సస్పెన్స్, సెక్స్ నిండిన "వార్‌క్రైమ్" నవల అది.

రెండు మూడు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధ తంత్రాన్ని తరిచి తరిచి వ్రాయాలి. ఈ మహాకార్యంలో స్టీలెట్ బృందం అహోరాత్రులు పనిచేస్తోంది. కొన్ని ప్రత్యక్ష వివరాలకై ఇతర దేశాలు అనేకసార్లు వెళ్ళివచ్చాడు స్టీలెట్ అనుచరుడు, మహాసాహసుడు అయిన కెన్నెత్ అలైకా, సొలైకా. రచయితలకు కొన్ని ప్రత్యేక సమాచారాలు అందించే "రైటర్స్ యేన్విల్" సంస్థ స్టీలెట్ కోసం ప్రత్యేకంగా పనిచేస్తోంది కూడా.

"ఉల్ఫ్ ఐలాండ్స్" లో అమలులో ఉన్న ఒక వివాహ ఆచారం యొక్క వివరాలు కనుక్కోమని కెన్నెత్‌ని పంపించాడు ఈసారి. అతని నుంచి ఏ క్షణంలో నైనా వార్త రావచ్చు. ఈ నవల ముగింపు ఆ ఆచారం ఇంకా పాత పద్ధతిలోనే నడుస్తూ వుంటే, నవల అనుకున్న విధంగానే ముగించవచ్చు. లేదా ముగింపు పద్ధతి మారి, మళ్ళీ మొదటి నుంచీ నవల అంతా మార్చుకుంటూ రావాలి. ఇప్పటికే రెండు సంవత్సరాలయింది.

గ్రేనైట్ పబ్లిషర్స్ అధినేత గోలే గోల పెట్టేస్తున్నాడు. తనీ "టెన్షన్" తో చచ్చిపోతాడేమో....

ఇంతలో ప్రక్కనే వున్న అన్ లిస్టెడ్ ఫోను మోగడానికి ఉపక్రమించింది. శబ్దం కన్నా వేగంగా ఫోనందుకున్నాడు సెన్‌స్టీలెట్ "హలో కెన్నత్ చెప్పు" అంటూ

ఈ అన్ లిస్టెడ్ ఫోను నంబరు అనీకి, కెన్నత్‌కి రైటర్స్ యేన్విల్ చీఫ్ డ్రేగ్‌కి మాత్రమే తెలుసు. ఈ పరిస్థితులలో ఆ ఫోను చేసేది ఒక్క కెన్నత్ మాత్రమే.



అవతలి నుంచి కెన్నెత్ అలైకా సొలొకా గొంతు హుషారుగా వినిపించసాగింది. “యూ ఆర్ కరెక్ట్ బాస్, ప్రొసీడ్ విత్ యువర్ నావెల్ అండ్ ఫినిష్ యిట్, కొద్ది గంటలలో నేను మీ దగ్గరుంటాను.

★ ★ ★

“గురూజీ! ఇదుగో ఇవాళే రిలీజ్ అయింది మార్కెట్లో! సెన్స్టీలెట్ లేటెస్ట్ నవల ఎ మిషన్ టు ఉల్ఫ్ ఐలాండ్స్, కమాన్ కమాన్” సుడిగాలిలా గదిలోకి దూసుకు వచ్చాడు గ్రేనైట్ పబ్లిషర్స్ అధినేత భయంకర్.

“నీకెందుకు బ్రదర్, యూడోంట్ వర్రీ! టూ డేస్ చాలు! “వృకోదరుడు” నవల నీ చేతులలో వుంటుంది!! ఛీర్స్!! వెంటనే నవల పేరు కూడా చెప్పేసి పబ్లిషర్స్ని సంభ్రమాశ్చార్యాలలో ముంచెత్తాడు దీ గ్రేట్ సెన్ స్టీలర్ ఆఫ్ ఆంధ్రా! ఐమీన్ పెన్స్టీలెట్ ఆఫ్ ఆంధ్రా!